## క్లుప్తంగా

### వసతి గృహ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

వినుకొండ (నూజెండ్ల): పట్టణంలోని కారంపూడి రోడ్డులో గల ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పి.రత్నకుమారి తెలిపారు. ఈ వసతి గృహంలో ఇంటర్, డిగ్రీ, ఒకేషనల్ కోర్సులు చదివే ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులను చేరవచ్చని తెలిపారు. ఈ నెల 30వ తేదీలోపు ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. వివరాలకు 9299458262, 8639189463 నంబర్లను సంప్రదించాలన్నారు.

### ఘనంగా కోదండ రామాలయ వార్షికోత్సవం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శ్రీ కోదండ రామాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు గత రెండు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం స్వామివారి ఉత్సవ మూర్తులకు కలశస్నపన, భక్తులచే అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొని స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. స్వామివారి ఊరేగింపు, కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు నారాయణం శశాంక్, జయచంద్, మోహనకృష్ణ, ఆలయ ఈవో కొల్లి హనుమంతరావు, శివలింగ ప్రసాద్, చైర్మన్ కొల్లిపర సుబ్రహ్మణ్యం, బి.రవికుమార్, నాగపవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### బడిఈడు పిల్లలందరూ చదువుకోవాలి

ఎంఈవో సాంబశివరావు

శావల్యాపురం: మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 39 ప్రభుత్వ పాఠశాలల్లో బడి ఈడు పిల్లలందరూ తప్పనిసరిగా బడిలో చేర్పించే బాధ్యతను ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు కోరారు. సోమవారం ఏంఈవో మాట్లాడుతూ 1 నుంచి 10 తరగతి విద్యార్థులకు అందాల్సిన స్టూడెంట్ కిట్లు యూనిఫాంమినహా అన్నీ వచ్చినట్లు చెప్పారు. నేను బడికి పోతా అనే కార్యక్రమం ద్వారా అన్నీ గ్రామాల్లో పరిధిలో ప్రజల్లో చైతన్యం పెంపొందించాలన్నారు. గత ఏడాదిలో 2913 మంది విద్యార్థులు విద్యను అభ్యసించారన్నారు. బడికిపోతా కార్యక్రమం విద్యార్థుల తల్లిదండ్రుల ఇళ్లకే నేరుగా వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలు తీరు తదితర వాటిని ఉపాధ్యాయులు వివరించాలన్నారు. బ్యాగ్స్-2398, బెల్టులు-1684, నోట్ పుస్తకాలు-13694, షూస్-2414, పాఠ్యపుస్తకాలు-24823, తదితరవన్నీ నూరుశాతం అన్నీ పాఠశాలలకు మంజూరైనట్లు చెప్పారు.

### ఘనంగా చంద్రమౌళీశ్వర ఆలయ వార్షికోత్సవం




రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో వేంచేసియున్న గంగా పార్వతీసమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ మూడవ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే భక్తులకు ప్రసాదాల పంపిణీతో పాటు భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నల్లబాటి రాము పాల్గొని పూజలు చేశారు.

### అన్న క్యాంటిన్ పునరుద్ధరణకు చర్యలు



సత్తెనపల్లి: పట్టణంలోని తాలుకా సెంటర్‌లో అన్న క్యాంటీన్ పునరుద్ధరణకు అధికారులు ముమ్మర కసరత్తు చేపట్టారు. దీనిలో భాగంగా మున్సిపల్ అధికారులతో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి సోమవారం అన్న క్యాంటిన్‌ను సందర్శించి దానిని వాడుకలోకి తీసుకు వచ్చేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ బి.మధుసూధనరావు, ఏఈ ఎం.సాగర్‌రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి, శానిటేషన్ సెక్రటరీ ఉదయ్, సిబ్బంది పాల్గొన్నారు.

### శ్రీమద్భగవద్గీతపై ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం బండ్లమూడి విజయలక్ష్మి సౌజన్యంతో భగవద్గీతలోని జ్ఞాన విజ్ఞానయోగంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్మయా మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి ప్రసంగించారు.

# త్యాగానికి, ధర్మనిబద్ధతకీ ప్రతీక బక్రీద్

- ఘనంగా బక్రీద్ పర్వదినం
- వేర్వేరు ప్రాంతాల్లో నమాజ్ చేసిన ముస్లింలు



చిలకలూరిపేట ఈద్గా మైదానంలో బక్రీదు సందేశం వింటున్న ముస్లింలు



యడ్లపాడు ఈద్గా వద్ద ఈద్ నమాజులో దువా చేస్తున్న ముస్లింలు



యడ్లపాడు ఈద్గా వద్ద బక్రీద్ పండుగ విశిష్టతను వివరిస్తున్న హాఫీజ్ సాబ్

చిలకలూరిపేట: త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని ముఫ్తీ పఠాన్ అనస్‌ఖాన్ చెప్పారు. బక్రీద్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. ఉదయం అడ్డరోడ్డు సెంటర్‌వద్ద ఉన్న ఈద్గా మైదానంలో వేలాది మంది సామూహిక నమాజు చేశారు. నమాజు నిర్వహింప చేసిన అనస్‌ఖాన్ మాట్లాడుతూ దైవ ప్రవక్త ఇబ్రహీం, దేవుని (అల్లా) ప్రసన్నం కోసం చేసిన అసమాన త్యాగాన్ని స్మరిస్తూ ప్రతిఏటా బక్రీద్ పర్వదినాన్ని నిర్వహిస్తారని చెప్పారు. స్వార్థం, అహం ఉన్న చోట మానవత్వం పరిమళించదని, సంకుచిత ధోరణి వీడితే త్యాగం పరిఢవిల్లుతుందని వివరించారు. నేను నాది అనే భావాన్ని వీడాలని అహంకారం, అసూయ, స్వార్థం మనసు నుంచి తొలగించాలని లోకానికి తెలిపేదే బక్రీద్ అని వివరించారు. ముందుగా ముఫ్తీ ఖలీల్‌ఖాన్ పండుగ విశేషాలను వివరించారు. ప్రార్థనల అనంతరం పెద్దలు, చిన్నలు బక్రీదు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ప్రార్థనల ఏర్పాట్లను అంజుమన్-ఏ-ఇస్లామియా కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

యడ్లపాడు: త్యాగనిరతికి.. ,ధర్మనిబద్ధతకీ ప్రతీక అయిన బక్రీద్ పండుగను యడ్లపాడు మండలంలోని ముస్లిం సోదరులు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయం 8 గంటలకే పండు నమాజ్‌కు ముస్లింలు ఈద్గాలు, మసీదుల వద్దకు హాజరయ్యారు. యడ్లపాడు, బోయపాలెం, కారుచోల గ్రామాల్లోని ఈద్గా మైదానాల్లో ఈద్ నమాజ్‌ను చదివారు. మిగిలిన గ్రామాల్లోని మసీదుల్లో పండగ ప్రార్థనలు చేశారు. త్యాగం మనిషిని ఉన్నతుడిని చేస్తుందని దైవ పరీక్షలో కట్టుకున్న భార్యని వదిలి కన్న కొడుకు ప్రాణాలను బలిచ్చేందుకు సిద్ధపడిన మహనీయుడు త్యాగానికి గుర్తుగా ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని జరుపుకుంటారని మతపెద్దలు బోధించారు. పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండటమే ఈ పండుగ ఇచ్చే సందేశమన్నారు. దైవం ప్రసన్నం కోసం తమ కిష్టమైన ఎలాంటి వస్తువునైనా త్యాగం చేయాలని ఖుర్బానీ ప్రత్యేకతని తెలిపారు. సామూహిక నమాజు అనంతరం ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుంటూ సంతోషంగా ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఇళ్ల వద్ద ఖుర్బానీ పొట్టేళ్ల మాంసాన్ని పేదలకు పంపిణీ చేశారు. యువకులు తలనీలాలను ఖుర్బానీ కింద తీయించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ముస్లిం వాడల్లో సందడి నెలకొంది. సాయంత్రం ముస్లిమేతరుల్ని విందు భోజనాలు ఏర్పాటు చేసి ఆనందంగా గడిపారు.



ముప్పాళ్ల ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రొంపిచర్ల ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

**శావల్యాపురంలో...**

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు, శానంపూడి, కారుమంచి, శావల్యాపురం, పోట్లూరు, మతుకుమల్లి తదితర గ్రామాల్లో బక్రీదు పర్వదినం వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శావల్యాపురంలో మజిదఏ బిలాల్ మసీదు ప్రార్థన మందిరంలో మత పెద్ద అబ్దుల్ రహీమ్ సారథ్యంలో ముస్లిం సోదరులు ఐక్యతగా ప్రార్థనలు చేశారు. మానవుల్లో త్యాగనిరతిని వ్యాపింప చేయటమే బక్రీద్ పర్వదినం విశిష్టత అన్నారు. స్వార్థ, రాగద్వేషాలు, వదిలిపెట్టి త్యాగ గుణం పెరగాలన్నారు. త్యాగ గుణాన్ని ప్రభోదించే బక్రీద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సమైక్యతా మానవత్వం దిశగా అడుగులు వేయాలన్నారు. అనంతరం ముస్లిం సోదరులు బక్రీదు శుభాకాంక్షలు తెలుపుకుని ఆలింగనం చేసుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి బక్రీదు వేడుకలు ముస్లిం సోదరులు తమ ఇళ్లలో వైభవంగా నిర్వహించారు.

**వినుకొండలో....**

వినుకొండ(నూజెండ్ల): ముస్లిం సోదరులు బక్రీదు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పెద్దమసీదు, జామియా మసీదులతో పాటు పలు మసీదుల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం తిమ్మాయపాలెం రోడ్డులోని ఈద్గా వద్దకు పెద్దసంఖ్యలో ముస్లిం సోదరులు చేరుకొని సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని గ్రామాల్లో కూడా బక్రీదు పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.

**ఈపూరులో...**

ఈపూరు: మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్ వేడుకలను ముస్లిం సోదరులు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో గల ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు బక్రీద్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు.

**రొంపిచర్లలో...**

రొంపిచర్ల: మండలంలో ముస్లిం సోదరులు సోమవారం బక్రీద్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లోని మసీదులను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. వారు ఒకరికొక్కరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. గోగులపాడు, అలవాల, మునమాక, విప్పర్లపల్లి, రొంపిచర్ల, సంతగుడిపాడు, కర్లకుంట, విప్పర్ల, కొత్తపల్లి, ఎడ్వర్డ్‌పేట తదితర గ్రామాలలో గల ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు చేశారు. మానవాళికి ప్రేమ, త్యాగనిరతిని నేర్పించిన ఈ పండుగ విశిష్టత గురించి ముస్లిం పెద్దలు, ముజావర్లు వివరించారు. అనంతరం పేదలకు, బిచ్చగాళ్లకు తమకు తోచిన విధంగా దానధర్మాలు చేశారు.

**నాదెండ్ల మండలంలో....**

నాదెండ్ల: భగవంతుడిపై అచంచల విశ్వాసం, త్యాగానికి ప్రతీక బక్రీద్ పర్వదినమని ముస్లిం మత పెద్ద, ఇమామ్ సర్ఫరాజ్ చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు జరిపారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సాతులూరులో జరిగిన కార్యక్రమంలో ఇమామ్‌లు అబ్దుల్ హఫీజ్, మహమ్మద్ అలి, వసీం మాట్లాడుతూ, తన కలలో కనిపించిన సర్వేశ్వరుడి ఆజ్ఞను నెరవేర్చేందుకు ఇబ్రహీం ప్రవక్త తన కుమారుడు ఇస్మాయిల్‌ను బలిచ్చేందుకు సిద్ధపడ్డారని, ఆయన త్యాగానికి మెచ్చిన భగవంతుడు ఇస్మాయిల్ స్థానంలో గొర్రెను ఏర్పాటు చేసి బలిని పూర్తి చేశారని చెప్పారు. దేవుడిపై భక్తి, విశ్వాసానికి ఇబ్రహీం ప్రవక్త జీవితం ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ దేవుని మెప్పించేలా జీవించాలని, ధనవంతులు తమ ధనంలో తప్పనిసరిగా కొంత భాగాన్ని పేదవారి శ్రేయస్సుకు వెచ్చించాలన్నారు. అందరూ సంతోషంగా ఉన్నపుడే సమాజం సుభిక్షంగా ఉంటుందన్నారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు ఈ నమాజ్‌కు హాజరయ్యారు.



శావల్యాపురం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



గణపవరంలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు



చిలకలూరిపేట ఈద్గా మైదానంలో బక్రీదు ప్రార్థనల్లో ముస్లింలు



నరసరావుపేటలో నమాజు చేస్తున్న ముస్లింలు



యడ్లపాడులో సామూహిక నమాజ్‌కు హాజరైన ముస్లింలు

## సాందీపని ఆశ్రమంలో గాయత్రీ మహాయజ్ఞం

కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలోని సాందీపని ఆశ్రమంలో గాయత్రీమాత జయంతి సందర్భంగా 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం సోమవారం నిర్వహించారు. విశ్వశాంతి లోకకల్యాణార్థం సాందీపని ఆశ్రమ గాయత్రీ శక్తి పీఠ ప్రాంగణంలో పండిత శ్రీరామ శర్మ ఆచార్య మాతా భగవతీ దేవి శర్మ, రామకృష్ణ గురుదేవుల సూక్ష్మ సంరక్షణలో మహాయజ్ఞం నిర్వహించారు. గాయత్రీ పరివార్ సభ్యులు, భక్తులు మహాయజ్ఞంలో పాల్గొన్నారు. ఆశ్రమంలోని సరస్వతి మాత ఆలయంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



గాయత్రీ మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

**భక్తిశ్రద్ధలతో గాయత్రీమాత జయంతి**

పెదకూరపాడు: మండల పరిధిలోని 75 త్యాళ్లూరు గ్రామంలోని గీతా మందిరంలో సోమవారం గాయత్రీమాత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి ఉపాసకులు ఆధ్యాత్మిక గురువులు అంకారావు మాస్టారు పాల్గొని గాయత్రీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గాయత్రి హోమం నిర్వహించి గాయత్రి మాత విశిష్టత సత్సంగం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ చిన్ననాటి నుండి ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని, గురువుని గౌరవించాలని సేవాభావం కలిగి ఉండాలని, గురువు ఆజ్ఞతో సేవా కార్యక్రమాలు చేయాలని అన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువులు కాశిపాడు, జలాలపురం, తాళ్లూరు అబ్బురాజుపాలెం గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా వేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షికోత్సవం

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం 10వ వార్షికోత్సవ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. లోకకల్యాణం, గ్రామ శ్రేయస్సు కాంక్షిస్తూ స్వామి వార్ల వార్షికోత్సవ మహోత్సవం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు ఆరాధన, పుణ్యాహవాచనం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. అగ్ని ప్రతిష్టాపన, వేంకటేశ్వర మూలమంత్ర హోమం, నారాయణ అష్టాక్షరీ మంత్ర హోమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామి వార్ల గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకులు, ఆలయ కమిటీ భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వార్షికోత్సవం సందర్భంగా హోమాలు చేస్తున్న దృశ్యం

### 22న భూసురపల్లి ఆదిశేషయ్య ఆరాధన

నగరంపాలెం: ప్రఖ్యాత డోలు విద్వాంసులు, లయబ్రహ్మ దివంగత భూసురపల్లి ఆదిశేషయ్య ఆరాధన ఈనెల 22న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై ఆరాధన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో ఆదిశేషయ్య ఆరాధన ఉత్సవాల్లో భాగంగా ఐదుసార్లు ఆయా రంగాల ప్రముఖులకు పురస్కారాలు అందజేసినట్లు వివరించారు. డాక్టర్ కొమాండూరి శేషాద్రికి పురస్కారం ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

### శ్రేష్ట ఆస్పత్రిలో గుండె జబ్బులకు ఆధునిక చికిత్స

గుంటూరు మెడికల్: నగరంలోని గుజ్జనగుండ్లలో ఉన్న శ్రేష్ట ఆస్పత్రిలో గుండె జబ్బులకు ఆధునిక పద్ధతిలో ఐవీయూఎస్ విధానం ద్వారా గుండె చికిత్సలు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గుండెజబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ గొట్టిపాటి నాగార్జున తెలిపారు. ఇటీవల కాలంలో యువకులు ఎక్కువ మంది గుండెజబ్బుల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఎక్కువ మంది గుండె రక్త నాళాల్లో అడ్డంకులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. వీటిని తొలగించడానికి యాంజియోగ్రామ్ ద్వారా స్టంట్లు అమర్చి అడ్డంకులు తొలగిస్తున్నట్లు వెల్లడించారు. ఇంట్రా వర్క్యులర్ ఆల్ట్రా సౌండ్ (ఐవీయూఎస్) ద్వారా స్టంట్లు అమర్చడం వలన రోగులకు దీర్ఘకాలంలో మళ్లీ రక్త నాళాల్లో పూడిక ఏర్పడడానికి అవకాశాలు తక్కువ అన్నారు. స్టంట్ కూడా సరైన పరిణామంలో తగిన విధంగా కచ్చితంగా అమర్చడం జరుగుతోందని వివరించారు. దీని వలన మెరుగైన ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. చికిత్స తమ ఆసుపత్రిలో నిర్వహిస్తున్నట్లు నాగార్జున వివరించారు.

## అంగన్‌వాడీలకు అండగా నిలుస్తా

- ప్రతీ సమస్య పరిష్కరిస్తాం
- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట: సమాజానికి అంగన్‌వాడీ కార్యకర్తలు చేసే సేవ అనిర్వచనీయమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని భువనచంద్ర టౌన్‌హాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తన కుమార్తె డాక్టర్ అమూల్యతో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వేతనాలు పెంచాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు కోరిన విషయాన్ని గుర్తు చేస్తూ.. ప్రస్తుతం తమ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తామన్నారు. వేతనాల పెంపు సహా అన్ని డిమాండ్లను పరిష్కరించేలా ముఖ్యమంత్రి చంద్రబాబును ఒప్పిస్తామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ ఆర్థికంగా దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నామన్నారు. విద్యా, వైద్య రంగాలను సమూలంగా ప్రక్షాళన చేసి పారదర్శకమైన పాలన అందించే బాధ్యత తీసుకుంటామన్నారు. ప్రజల కోసం నిత్యం పనిచేసే అంగన్‌వాడీలను ఆదుకునే బాధ్యత తానే తీసుకుంటానని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకురాలు డి.శివకుమారి, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అంగన్‌వాడీ నాయకులు

## ఘనంగా సోమేశ్వర స్వామి వార్షికోత్సవం

శావల్యాపురం: మండలంలోని గంటావారి పాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగా పార్వతీ సమేత సోమేశ్వర స్వామి దేవాలయంలో 7వ వార్షికోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ పూజారి సౌభాగ్య శర్మ మాట్లాడుతూ గత మూడు రోజుల నుంచి గ్రామస్తులు ఆలయ ధర్మకర్త కొసన రామకోటేశ్వరరావు దంపతుల సారథ్యంలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. చివరిరోజు ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరణ చేసి వేదపండితులు వేదమంత్రాలు మేళ తాళాలు నడుమ దంపతులచే స్వామి వారికి కల్యాణ వేడుకలతో పాటు మహాపూర్ణాహుతి, విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్‌ను పూలమాలలు నూతన పట్టు వస్త్రాలతో అలంకరణ చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు భారీ అన్నదాన సంతర్పణ కార్యక్రమాలలతో ఏర్పాటు చేశారు. దేవాలయాన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేయటంతో పాటు ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో మేళ తాళాలతో ఊరేగించారు.



స్వామి వారి మూలవిరాట్

## గోవింద నామస్మరణతో మార్మోగిన వేంకటేశ్వరుని సన్నిధి

వైభవంగా మొదలైన బ్రహ్మోత్సవాలు

నగరంపాలెం: చిన్న తిరుపతిగా పేరొందిన లాలాపేటలోని శ్రీపద్మావతి ఆండాళ్ సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలు సోమవారం భక్తి శ్రద్ధలతో మొదలయ్యాయి. భక్తుల రాకతో వేకువజాము నుంచే గోవింద నామస్మరణతో దేవాలయం మార్మోగింది. ఉదయం స్వామి వారికి అమ్మవార్లకు పంచామృత అభిషేకాలు జరిగాయి. స్వామి వారిని అమ్మ వార్లను పెండ్లి కుమారునిగా, పెళ్లి కుమార్తెలుగా అలకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం విష్ణు సహస్ర పారాయణం జరగ్గా, సాయంత్రం అంకురారోపణ, ధ్వజారోహణ, విశ్వేశ్వర పూజ పుణ్యావచన అఖండ దీపారాధన అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయడంతో, స్వామి వారిని, అమ్మ వార్లను దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీజగన్నాథ ఆంజనేయ వెంకటేశ్వర స్వామి వార్ల దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, దేవస్థానం సహాయ కమిషనర్(ఈఓ) డి.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు ఆర్‌టీ ఆర్‌వీ ప్రసాద్, శ్రీనివాసాచార్యులు, మురళీచంద్రకుమార్ పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకారంలో శ్రీస్వామి వారు, అమ్మవార్లు

### 30న రామస్వామి వర్ధంతి సభ

లక్ష్మీపురం: కాబోతు రామస్వామి వర్ధంతి సభ ఈనెల 30వ తేదీ నిర్వహించనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వర రావు తెలిపారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో సంఘ సమావేశం తన్నీరు ప్రభుదాసు అధ్యక్షతన నిర్వహించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com